


పిచ్చోడు!

అతన్ని కొందరు "పిచ్చిమారాజు " అంటారు. మరి కొందరు "పిచ్చి దేవుడు" అంటారు. అతను ఎవ్వరితోనూ ఏమీ అనడు. విలాసంగా నవ్వుకుంటూ వీధి వెంట వెళ్ళిపోతుంటాడు. చిరిగిపోయిన చొక్కా మోకాళ్ళ కిందకి వేలాడుతుంటే, ఓ కందిపుల్లకి పురికొస చర్నాకోలలా కట్టి ఆ చర్నాకోల గాలిలో జళిపించుకుంటూ నడిచి వెళ్తాడు. పిల్లలు కనిపిస్తే పకపక నవ్వుతాడు. గాలిగోపురంలోని పావురాళ్ళు రెక్కలు టపటప లాడించుకొంటూ ఒక్కుమ్మడిగా ఆకాశంలో కెగిరితే తనూ చప్పట్లు కొట్టి పార్లి, పార్లి నవ్వుతాడు.

అతని దేవూరో తెలియదు!

పేరేవిటో అంతకంటె తెలియదు.

ఓ రోజు ఉన్నట్టుండి ఊళ్ళోకొచ్చి పడ్డాడు. పొద్దున్నే శేషమ్మ పునుగులేస్తుంటే వెళ్ళి గడపలో కూర్చుని చెయ్యి జాపాడు పెట్టమని.

"బోణీ కాకుండా అడుక్కునే వాళ్ళ గొడవేమిటి ఫో" అంది శేషమ్మ. మళ్ళీ చెయ్యి జాపాడు పిచ్చోడు.

"ఛీ ఫో" అని గంటె ఎత్తింది.

పిచ్చోడు లేచి వెళ్ళిపోయాడు. మరుక్షణంలో సుడిగాలి రేగింది. దుమ్మూ దూగరా ఉవ్వెత్తున లేచివచ్చి పునుగుల నిండా భగోణిలో నూనె నిండా పడి ఇంత దుమ్ము శేషమ్మ కళ్ళలో కొట్టి మరీ వెళ్ళింది.

ఆ తర్వాత పిచ్చోడు సుబ్బయ్య మిఠాయి కొట్టు దగ్గరకెళ్ళి చేయి జాపాడు. సుబ్బయ్య ఏ కళనున్నాడో పూస మిఠాయి ముక్క తుంచి పిచ్చోడిచేతులో వేశాడు. గంట తిరిగిందో లేదో చుట్టపక్కల ఊళ్ళనుంచి భజన సమాజాలు బళ్లు కట్టుకుని దిగాయి. కొట్లో వున్న మిఠాయంతా అమ్మకమైపోయింది. అంత లాభం ఈ మధ్యకాలంలో సుబ్బయ్య కళ్ళ జూడలేదు.

ఊరందరికీ తెలిసిపోయింది, పిచ్చోడి చెయ్యి గొప్పది. అతడు అడుగుపెడ్తే చాలు శుభం అని. ఆ రోజు నుంచి పిచ్చోడు చక్రవర్తి. ఏది కావాలన్నా ఎగిరి గంతేసి ఇస్తారు. కాని అతను అందరి దగ్గరా తీసుకోడు. ఎవరి దగ్గరైనా తీసుకొంటే వాడికి అదృష్టం కలిసివచ్చినట్లే. జూదగాళ్ళు అతని చెయ్యి తాకి పేకాటకు వెళ్ళాలని ఆత్రపడ్డారు కాని, అతను అందర్నీ అంటుకోనివ్వడే!

పెళ్ళి జరిగినా, పేరంటం జరిగినా, సభ జరిగినా, సమావేశం జరిగినా అందరూ పిచ్చోడి కోసం ఎదురుచూస్తారు. అతను వచ్చి నాలుగు మూలలా తిరిగి ఏ పండో ఫలమో తీసుకుని వెళ్ళిపోతే ఆ కార్యం నిర్విఘ్నంగా జరుగుతుంది. ఓసారి సీతారామయ్యగారింట్లో పెళ్ళి. పెద్ద పెద్ద పందిళ్ళు వేసి మేళతాళాలతో

ఘనంగా ఏర్పాటు చేశారు. మూడు రోజుల్నించి పిచ్చోడి కోసం వెతుకుతున్నారు. ఎక్కడా కన్పించలేదు. మనుషుల్ని పంపించారు. దొరకలేదు. "అతను వచ్చి పెళ్లి పందిట్లో నడిచి వెళ్ళలేదే!" అని అందరి గుండెల్లో భయం. ముహూర్తం మరో గంట ఉందనగా ఆకాశం ఉరిమింది. మబ్బులు పెళపెళ లాడాయి. కుండపోతగా జోరున వర్షం. పిచ్చోడు రాలేదు. వర్షం ఆగలేదు. పెద్దలంతా ఈ పెళ్ళి జరుగుతుందా అని భయపడి కాళ్ళూ చేతులు ఆడక బెంబేలు పడుతున్నారు. అల్లాంటి సమయాన వర్షంలో తడిసి వణుక్కుంటూ పందిట్లోకి వచ్చి పడ్డాడు పిచ్చోడు. "హమ్మయ్య!" అనుకున్నారందరూ. కుర్చీ వేసి కూర్చోపెట్టారు. నీళ్ళు కారుతున్న జుట్టు తుడుచుకోడు, పొడి బట్టలిస్తే వేసుకోడు, తోరణాల్ని బాజాభజంత్రీల్ని చూసి నవ్వుతాడు. అలా అతను నవ్వుతూంటే గొప్ప ధైర్యంగా ఉంది అందరికీ. పాలూ ఫలహారాలిస్తే వద్దన్నాడు. వర్షం తగ్గుముఖం పట్టింది. పందిరి అంతా తిరిగాడు. కాస్సేపు డోలు వాయించి పెద్దగా నవ్వాడు. పెళ్ళికూతుర్ని చూపించమన్నాడు. సిగ్గుపడుతూ నుంచున్న పెళ్ళికూతుర్ని చూసి మళ్ళీ నవ్వాడు. పెళ్ళికూతురి చేతినుంచి తాంబూలం తీసుకుని నములుతూ చెర్నాకోల వూపుకుంటూ వెళ్లిపోయాడు. అంతే వానతగ్గి ఫెళ్ళున ఎండ వచ్చి పెళ్లి నిర్విఘ్నంగా జరిగిపోయింది.

ఓసారి దొరగారు కోటలో ఎవరితోనో మాట్లాడుతున్నారు. సరాసరి కోటలోకి వెళ్ళి దొరగారికి ఎదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాడు పిచ్చోడు. ఏమి ఠీవిగా కూర్చున్నాడు. జమీందారుగార్ని మించిన దర్జాతో కూర్చున్నాడు "ఏవన్నా కావాలా" అని దొరగారడిగితే ఏ వక్కర్లేదని చెయ్యి ఊపాడు. కొంతసేపటికి దొరగారికి తాంబూలం తీసుకొచ్చారు. హుందాగా వేలు చూపించాడు తనకూ కావాలని, రాచఠీవితో తాంబూలం నముల్తూ చెర్నాకోల వూపుకుంటూ లేచి వచ్చేశాడు.

అలా దొరలకి దొరగా చలామణీ అయ్యే పిచ్చోడు తిరిగి తిరిగి ఎంత రాత్రయినా గాలి గోపురంలోకి వచ్చి పడుకునేవాడు. ఒక రాత్రివేళ హృదయ విదారకమైన ఏడుపు వినిపించింది పిచ్చోడికి. చెంగున లేచాడు. గుండె చిల్లులు పడేట్టు ఏడుస్తోంది సుబ్బమ్మ. ఒక్కగా నొక్క కూతురు పెళ్ళికెదిగిన కూతురు జబ్బున

పడింది. అందరూ ఆశలు వొదులుకున్నారు. తల్లి ఆపుకోలేక గొల్లుమంటుంటే చీకటి చెదిరి పోతోంది. పిచ్చోడు చెర్నాకోల తీసుకుని పరుగు పరుగున సుబ్బమ్మ ఇంటికొచ్చాడు. సుబ్బమ్మ పిచ్చోణ్ణి చూసి " నా అయ్య వచ్చావా! నా దేవుడు వచ్చావా! నీ చేత్తో నా బిడ్డని తాకయ్యా! నా బిడ్డని బతికించయ్యా" అని పిచ్చోడి కాళ్ళు పట్టుకుంది.

పిచ్చోడు మంచం మీద కూర్చున్నాడు. ఎప్పుడూ నవ్వుతూ ఉండే పిచ్చోడు ఆ రోజు ఏడ్చాడు. కన్నీళ్లు ధారలు ధారలుగా పిల్లమీద పడ్డాయి. నుదురు నిమిరాడు. వొళ్ళు నిమిరాడు. ఏడ్చి ఏడ్చి చర్నాకోల అక్కడే వొదిలేసి గోపురంలో కొచ్చి పడుకున్నాడు. అందరూ ఆశలొదుకున్న సుబ్బమ్మ కూతురు కళ్ళు విప్పి చూసింది.

మర్నాడు ఊరంతా వనసమారాధన ఏర్పాటు చేసుకున్నారు. సామాన్లన్నీ సర్ది తోపులోకి వెళ్ళాలి. పిచ్చోడు కన్పించలేదు. అతను ఎదురొచ్చి కన్పిస్తే తప్ప బయలుదేరడానికి వీల్లేదాయె! మనుషుల్ని పంపించారు వెదకమని, ఎక్కడా కన్పించలేదు. ఎవరో గాలిగోపురం లోంచి పెద్దగా కేకేశారు. "పిచ్చోడు చచ్చిపోయా"డని.

ఊరు ఊరంతా గొల్లుమంది. ఆడవాళ్ళు పిల్లలతో సహా గోపురం దగ్గరకు. పరుగెత్తు కొచ్చారు. భోరు భోరున ఏడ్చారు. ఊరంతా కన్నీళ్ళు. పిల్లలేడ్చారు, పావురాళ్ళేడ్చాయి. పెద్దలంతా చేరి పిచ్చోడికి అంతిమయాత్ర ఏర్పాటు చేశారు. అన్నివర్గాలవారు దేవుడి వాహనాన్ని మోసినట్టు మోశారు. కృష్ణ వొడ్డున పిచ్చోణ్ణి బూడిద చేశారు. వనసమారాధనకి తెచ్చుకున్న సంబారాలతో కృష్ణ వొడ్డున వంటచేసి బీదలకు అన్నదానాలు చేశారు.

ముందు వినాయకుణ్ణి ప్రార్థించినట్టు ఏ పని తలపెట్టినా పిచ్చోడి సమాధికి మొక్కి ఆ తర్వాత వెళ్తారు ఊరి జనం. పెళ్ళయినా, పేరంటమయినా, సభైనా, సమావేశమయినా పందిట్లో ఓ ఖాళీ కుర్చీ వేసి అక్కడ తాంబూలం పెడ్తారు. అది పిచ్చోడి కుర్చీ! *